సాక్షి రంగారెడ్డి

సోమవారం ౹ 16 ౹ డిసెంబర్ ౹ 2024



అవార్డు ప్రదానం

బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించే వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తోంది. 8లో▸



హెడ్‌మాస్టర్ల కమిటీ ఎన్నిక

కూకట్‌పల్లి పీఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. 8లో▸



పుచ్చ సాగుకు సమయమిదే

రబీలో ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసి లాభాలు పొందొచ్చంటున్నారు ఉద్యానవన అధికారులు. 8లో▸

న్యూస్‌రీల్

ధ్యాన మహాయాగాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలను జయప్రదం చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆల్ ఇండియా కో ఆర్డినేటర్ మాధవి పిలుపునిచ్చారు. మహేశ్వర మహాపిరమిడ్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పిరమిడ్ నిర్వాహకులతో కలిసి ధ్యాన మహాయాగాలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. బ్రహ్మర్షి సుభాష్‌పత్రీజీ 2011లో కడ్తాల్ సమీపంలో అతిపెద్ద ధ్యాన మహాపిరమిడ్ నిర్మించి, నిరంతరం ధ్యాన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఏటా డిసెంబర్‌లో కడ్తాల్ కైలసాపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో ధ్యాన చక్రాలు, ధ్యాన మహాయాగాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రపంచం నలుమూలల నుంచి ధ్యానులు హాజరవుతారని తెలిపారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ తలపెట్టిన ఈ అద్భుత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ధ్యానులతో పాటు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇక్కడికి వచ్చే లక్షలాది మంది ధ్యానులకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పిరమిడ్ నిర్వాహకులు, పిరమిడ్ మాస్టర్స్ పాల్గొన్నారు.

హిందూ సమాజ రక్షణకు త్రిశూల్ దీక్ష తీసుకోవాలి



హనుమాన్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

హుడాకాంప్లెక్స్: హిందూ సమాజ రక్షణకు యువత బజరంగ్‌దళ్‌లో చేరి త్రిశూల్ దీక్ష తీసుకోవాలని జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్, వివేకానంద జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ మండల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష కార్యక్రమానికి వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, కశ్మీర్ ఫైల్స్ సినీ నిర్మాత అభిషేక్ అగర్వాల్‌తో పాటు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం, సమాజం కోసం యువత ముందుకు రావాలని కోరారు. హిందువుల సంఖ్య నానాటికీ తగ్గుతోందని, అన్యమతస్తుల సంఖ్య పెరుగుతోందని, అతికొద్ది కాలంలోనే హిందూ జనాభా 90 శాతం కంటే దిగువకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమే దేశ రక్షణకు దోహదపడుతుందని, హిందూ ధర్మాన్ని కాపాడటానికి ప్రతి హిందువు మేల్కొనాలని సూచించారు. మత మార్పిడులను అరికట్టాలని, లవ్ జిహాదీలను అడ్డుకోవడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. శక్తిని పెంచుకోవాలని త్రిశూల్ దీక్షతోనే అన్యమతస్తులను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని స్పష్టం చేశా. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. అనంతరం సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై హనుమంతుని విగ్రహాన్ని ఊరేగించారు.

డైట్ చార్జీల పెంపు హర్షణీయం

బంట్వారం: వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ హాస్టళ్లలో 7.65 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. 3 నుంచి 7వ తరగతి వరకు రూ.950 నుంచి రూ.1,330, ఎనిమిది నుంచి 10 వరకు రూ.1,100 నుంచి రూ.1,540, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి రూ.2,100 వరకు డైట్ చార్జీలు పెరిగినట్లు ఆయన తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు సైతం పెంచడం అభినందనీయమన్నారు. బాలికలకు 3 నుంచి 7వ తరగతి వరకు రూ.55 నుంచి రూ.175 పెంచారన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



కుంట్లూరు పెద్ద చెరువు నుంచి ఓ కన్వెన్షన్ కోసం మున్సిపల్ నిధులతో వేస్తున్న రోడ్డు

ఏలికల సేవలో పురపాలికలు

బంధుగణానికి అప్పనంగా ప్రజాధనం

- కన్వెన్షన్లు, ఫంక్షన్‌హాళ్లు, అపార్ట్‌మెంట్ల వద్దే అభివృద్ధి పనులు
- సామాన్యుల సమస్యలను పట్టించుకోని వైనం
- పెద్ద అంబర్‌పేట్, అత్తాపూర్, బండ్లగూడజాగీర్, శంషాబాద్, తుర్కయంజాల్, బడంగ్‌పేట్ మున్సిపాలిటీల తీరుపై విమర్శలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంటూర్లుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి తన కుటుంబ సభ్యులు, బంధువుల పట్టా భూములకు రహదారి కోసం ఏకంగా రూ.20 లక్షల మున్సిపాలిటీ నిధులకు కౌన్సిల్ తీర్మానం చేయించారు. ఏడాది తర్వాత పనులు ప్రారంభించారు. అది కూడా ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసేందుకు కావడం విశేషం. ఇదే మున్సిపాలిటీకి చెందిన మరో ప్రజాప్రతినిధి ఏకంగా తన వార్డుకు మంజూరైన నిధులను పక్క వార్డులోని బంధువుల కన్వెన్షన్‌కు మళ్లించారు. రూ.30 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేసుకున్నారు. అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్‌కాలనీలో ఓ మంత్రి కుమారుడు బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. నిర్మాణ దశలో ఉన్న భవనానికి పోలీసుల పహారాలో జీహెచ్ఎంసీ అధికారులు బీటీ రోడ్డు వేయడం వివాదాస్పదమైంది'. సామాన్యుల సమస్యలు పరిష్కరించాల్సిన మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు పెద్దలు, బడా రియల్టర్ల సేవలో తరిస్తున్నాయి. చేపట్టే అభివృద్ధి పనులు, అంచనాలు, టెండర్లు ఖరారు వంటి అంశాలకు కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉంది. కొంతమంది ప్రజాప్రతినిధులు తమకున్న రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని అడ్డగోలు పనులకు వినియోగిస్తున్నారు.

కన్వెన్షన్లు, అపార్ట్‌మెంట్ల కోసం..

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. శివారులోని మరికొన్ని ప్రాంతాలు రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ సర్కిళ్ల పరిధిలో ఉన్నాయి. ఇక్కడ అనేక కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. వ్యక్తిగత నివాసాలతో పాటు బహుళ అంతస్తుల భవనాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వెలుస్తున్నాయి. ప్రజలు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు సహా ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ పర్మిషన్ల పేరుతో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో చార్జీలు చెల్లిస్తున్నారు. పన్నులు, ఇతర చార్జీల రూపంలో వచ్చిన మొత్తాన్ని ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ పలు మున్సిపాలిటీలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజల నుంచి వచ్చిన నిధులను 'పెద్ద'ల నిర్మాణాల వైపు మళ్లిస్తున్నాయి. నిర్మాణం పూర్తి కాకముందే రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. సామాన్యులు, పేదలు నివసించే బస్తీలు, కాలనీల్లో ఇప్పటికీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పార్కులు, వీధి లైట్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవు. తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా కోరుతూ కాలనీ సంక్షేమ సంఘాలు పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోకుండా కన్వెన్షన్లు, ఫంక్షన్‌హాళ్లు, అపార్ట్‌మెంట్ల కోసం నిధులు మళ్లిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా కాలనీల్లో పర్యటించి, స్థానికుల సమస్యలను గుర్తించి, కౌన్సిల్ చర్చించి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు ఇందుకు విరుద్ధంగా బంధువులు, బడా రియల్టర్ల సేవల్లో తరిస్తున్నారు. అదేమంటే నిధుల లేమి సాకుతో తప్పించుకు తిరుగుతున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు కూడా వారిచ్చే తాయిలాలకు ఆశపడి మౌనంగా ఉండిపోతున్నారు. పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్, అత్తాపూర్ డివిజన్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో ఈ తంతు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇదో పెద్ద దందా..



అపార్ట్‌మెంట్, వెంచర్‌కు సొంతంగా రోడ్డు, డ్రైనేజీ, తాగు నీరు వంటి పనులు చేపట్టాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కమిషనర్లు, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు డబ్బులు ఆశ చూపి కౌన్సిల్‌లో తీర్మానం చేయిస్తే సరిపోతుందని భావిస్తున్నారు. మాట వినని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి మరో చోటికి బదిలీ చేయిస్తున్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఇల్లీగల్ లేఅవుట్‌లో వెలిసిన అపార్ట్‌మెంట్‌కు రోడ్డు, డ్రైనేజీ వేశారు. రూ.30 లక్షల అంచనాతో శ్మశానవాటిక నుంచి ఓ ప్రైవేటు వెంచర్‌కు రోడ్డును ప్రతిపాదించారు. సాంకేతికంగా సమస్యలు రాకుండా ముందే కౌన్సిల్‌లో తీర్మానం చేయించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే దందా నడుస్తోంది. అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారు. స్థానికుల నుంచి తిరుగుబాటు వస్తే తప్ప పరిస్థితిలో ఎలాంటి మార్పు రాదు.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ నేత

కలవని 'చేతులు'



- చేవెళ్ల కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు
- ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరుకాని ఓ వర్గం
- స్థానిక ఎమ్మెల్యే సమాచారం ఇవ్వలేదని ఆరోపణ
- ఏ వర్గం వారికి వారే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- మార్కెట్ కమిటీల్లో చోటు దక్కలేదని కొంతమంది కినుక

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన కార్యక్రమానికే కాంగ్రెస్‌లోని ఓ వర్గం దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యే తమకు సమాచారం ఇవ్వలేదని సదరు వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి వర్గ పోరు మొదలైంది. ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్ వెంటే ఉన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడంతో కొందరు నాయకులు ఆయన కోటరీకి వెళ్లారు.

సమాచారం ఇవ్వలేదంటూ ..

మొయినాబాద్ మండలం చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన ఈ కార్యక్రమానికి భీంభరత్‌తోపాటు ఆయన వర్గం పూర్తిగా దూరంగా ఉంది. ఎమ్మెల్యే కాలె యాదయ్య కార్యక్రమాన్ని పూర్తిగా దగ్గరుండి నడిపించారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మాత్రమే కనిపించారు. ఎమ్మెల్యే తమకు సమాచారం ఇవ్వలేదని.. కార్యక్రమం మొదలు కావడానికి రెండు గంటల ముందు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారని భీంభరత్ వర్గం ఆరోపిస్తోంది.

ఎవరికి వారే యమునా తీరే..

ప్రస్తుతం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఎక్కడ కార్యక్రమాలు జరిగినా ఏ నాయకుడు హాజరైతే ఆ వర్గంవారే పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలోనూ ఇదే జరుగుతోంది. ఏ వర్గం వారికి చెందిన చెక్కులు ఆ వర్గంవారే లబ్ధిదారులకు అందజేస్తున్నారు. దీంతో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎవరి వెంట వెళ్తే ఏమవుతుందోనని ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు ఇటీవల ప్రకటించిన మార్కెట్ కమిటీల్లో అవకాశం దక్కని నాయకులు కినుక వహించారు. పదేళ్ల పాటు కష్టపడి పార్టీకోసం పనిచేసిన తమకు అవకాశాలు దక్కడంలేదని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పార్టీలో నెలకొన్న వర్గపోరు సద్దుమణిగేలా అధినాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో వేచి చూడాలి.

కనులపండువగా మల్లన్న జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర కనులపండువగా నిర్వహించారు. మూడు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం మల్లన్న స్వామి పల్లకీ సేవ చేశారు. చక్రస్నానం తర్వాత స్వామి వారిని డోలు, డప్పు వాయిద్యాలతో ఒగ్గు కళాకారుల నృత్యాలతో ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామంలోని మహిళలు బోనాలతో తరలివచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. జాతర సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి చంద్రయ్య స్వామి, నరేందర్‌రెడ్డి, రాజప్పగౌడ్, నాగప్ప, శకుంతల, వీరేందర్‌రెడ్డి, మంజుల, వెంకటేశం పాల్గొన్నారు.

స్వయంగా విగ్రహావిష్కరణ



తన విగ్రహాన్ని ఆవిష్కరించిన కళ్లెం నర్సింహారెడ్డి

- నగరంలో పుట్టిపెరిగి.. అమెరికాలో పంటల సాగు
- అక్కడి ప్రభుత్వం నుంచి ప్రశంసలు
- స్వదేశానికి వచ్చి చిలుకూరులో వ్యవసాయకళా క్షేత్రం ఏర్పాటు
- అక్కడే విగ్రహం ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో ఆవిష్కరించిన కళ్లెం నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు ఓ ఆదర్శరైతు. పుట్టి పెరిగిన గ్రామంలోనే కాదు అమెరికా వంటి అగ్రరాజ్యంలోనూ వ్యవసాయం చేశారు. అక్కడి ప్రభుత్వ మన్ననలు పొందారు రైతు కళ్లెం నర్సింహారెడ్డి. నగరంలోని కందికల్‌గేట్‌కు చెందిన కళ్లెం రాజిరెడ్డి, పెంటమ్మ దంపతులకు 1937లో జన్మించారు. పుట్టింది కోహెడలో అయినా..పెరిగింది అంతా చాంద్రాయణగుట్ట సమీపంలోని కందికల్‌గేట్‌లోనే. శాలిబండ హైస్కూల్లో టెన్త్ వరకు చదువుకున్నారు. ఆయన చిన్నతనం నుంచే వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నారు. అప్పట్లోనే ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేశారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆయనకు నలుగుకు కుమార్తెలున్నారు. వారంతా అమెరికాలో స్థిరపడ్డారు. దీంతో ఆయన 1975లో అమెరికా వెళ్లారు. అక్కడ దాదాపు 30 ఏళ్ల పాటు వివిధ రాష్ట్రాల్లోని ఐదు వేల ఎకరాల్లో వ్యవసాయం చేసి స్థానికుల దృష్టిని ఆకర్షించారు. అక్కడి ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2005లో దేశానికి తిరిగి వచ్చారు. ఇటు వ్యవసాయంతో పాటు అటు కళాభిమానిగా కళాపోషకుడిగా సేవలు అందించారు. ఇదే సమయంలో మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ క్షేత్రం సమీపంలో 3.9 ఎకరాల్లో కళ్లెం నర్సింహారెడ్డి పేరుతో వ్యవసాయ కళాక్షేత్రం ఏర్పాటు చేశారు. అటు పంటల సాగు చేస్తూనే, ఇటు పలు సాంస్కృతిక సంఘాలకు తనవంతు తోడ్పాటు అందిస్తూ వచ్చారు. వయసు మీద పడటంతో తన గుర్తుగా ఉండాలని స్వయంగా తన విగ్రహాన్ని తానే తయారు చేయించుకున్నారు. ఆదివారం తన భార్య లక్ష్మితో కలిసి తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు. అది కూడా ఓ పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయ బతుకమ్మ, బోనాలు, కోలాటాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలతో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా తన స్వీయ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారు. వ్యవసాయం ఉన్న అమితాసకే తనను ఇంతడివాడిని చేసిందని అంటున్నారు. కళాకారులు, కళాభిమానులే తన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని నర్సింహారెడ్డి చెబుతుండటం గమనార్హం.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆడిటోరియంలో టీఎస్‌యూటీఎఫ్ ఆరో జిల్లా మహాసభలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని అని అన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది వారిని ఉన్నతమైన శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్స్‌ను పీఆర్‌సీని, డీఏని విడుదల చేయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: గురునానక్ కాలేజీ వద్ద లోనికి పంపాలని పోలీసులను ప్రాధేయపడుతున్న అభ్యర్థులు



ఇబ్రహీంపట్నం: పరీక్ష సెంటర్‌కు పరిగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థిని

తొలిరోజు ప్రశాంతం

- గ్రూప్–2 పరీక్షలకు అభ్యర్థుల ఉరుకులు, పరుగులు
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ
- పలుచోట్ల ఉసూరుమంటూ వెనుదిరిగిన వైనం
- పలువురిని పెట్రోలింగ్ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు చేర్చిన పోలీసులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్ష ఆదివారం తొలి రోజు జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు సకాలంలో చేరుకునేందుకు అభ్యర్థులు ఉరుకులు పరుగులు తీశారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు కార్డు, బయోమెట్రిక్‌లను పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, ఆభరణాలు, షూస్, బ్యాగులను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ దుకాణాలను మూసివేయించారు.

ఆలస్యంగా వచ్చి.. వెనుదిరిగి..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో 21 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మార్నింగ్ సెషన్ పరీక్షకు 45 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. 16,584 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సిఉండగా.. 7,463 మంది హాజరయ్యారు. 9,121 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 7,444 మంది పరీక్ష రాయగా.. 19 మంది అభ్యర్థులు రాలేకపోయారు. 44.8 శాతం అభ్యర్థులు పరీక్ష రాశారు. గురునానక్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన సుమారు పది మంది అభ్యర్థులు.. పోలీసులను ఎంతగా ప్రాధేయపడినా నిరాకరించారు. దీంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

వాహనంలో ఎక్కించుకొని..

వినోబానగర్ సిద్ధార్థ కళాశాల సెంటర్ గేట్ వద్దకు శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళా అభ్యర్థి నడవలేని స్థితిలో వచ్చారు. కేంద్రం గేట్ నుంచి దూరంగా పరీక్ష హాల్ భవనం వరకు వెళ్లాలంటే సమయం పడుతుంది. ఆమె పరిస్థితిని గమనించిన ఏసీపీ కేపీవీ రాజు తన అధికారిక వాహనంలో హాల్ భవనం వరకు తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని ఇందు కళాశాల, ఏవీఎన్ పరీక్ష కేంద్రాలను మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షించారు.

ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో ఆదివారం గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మంగళ్‌పల్లిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 984 మంది అభ్యర్థులకు 451 మంది హాజరుకాగా, 533 మంది గైర్హాజరయ్యారు. సీవీఆర్ కళాశాలలో 1,968 మందికి గాను 889 మంది హాజరుకాగా, 1,079 మంది హాజరుకాలేదు. ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో 600 మందికి 177 మంది హాజరయ్యారు, మరో 207 మంది హాజరు కాలేదు. చింతపల్లిగూడ సమీపంలోని కేశవ మెమోరియల్ కళాశాలలో 504 మందికి 225 మంది హాజరుకాగా 279 మంది గైర్హాజరయ్యారు. ఎంపీపటేల్‌గూడ సమీపంలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 960 మందికి ఏర్పాటు చేయగా 442 మంది హాజరయ్యారు, 518 మంది హాజరుకాలేదు.

అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 12 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలకు 3,530 మంది హాజరయ్యారు. మొత్తం 8,136 మంది అభ్యర్థులకు గాను 4,606 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి, ఎస్సైలు కరుణాకర్‌రెడ్డి, మాధవరావు, భద్యానాయక్ పరిశీలించారు.

పోలీసుల బందోబస్తు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,224 మంది అభ్యర్థులకుగాను 874 మంది హాజరుకాగా 1,350 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజేత జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాల, ఠాగూర్ ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ స్కూల్, శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలవద్ద పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శభాష్.. పోలీస్



పోలీసు వాహనంలో దిగుతున్న అభ్యర్థి

షాద్‌నగర్‌రూరల్: ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షకు సమయం మించిపోతుండటంతో ఓ మహిళా అభ్యర్థి ఆందోళనకు గురైంది. మేమున్నామంటూ ట్రాఫిక్ పోలీసులు ఆమెను సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి ఔదార్యం చాటుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోగల దేవీగ్రాండ్ హోటల్‌వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళా అభ్యర్థిని ఆందోళనను గమనించిన ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ పెట్రోలింగ్ వాహనంలో ఆమె వద్దకు వెళ్లి విచారించాడు. పరీక్షకు సమయం మించి పోతోందని చెప్పడంతో ఆమెను తన పెట్రోలింగ్ వాహనంలో ఎక్కించుకొని మహబూబ్‌నగర్ రోడ్డులోని విజేత జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంవద్ద వదిలిపెట్టారు. దీంతో ఆమె సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకుంది. దీంతో తనకు సహకరించిన ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్, సిబ్బందికి మహిళా అభ్యర్థిని ప్రత్యేక కతజ్ఞతలు తెలియచేస్తూ పరీక్ష కేంద్రంలోకి వెళ్లింది. విషయం తెలిసిన ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ సిబ్బందిని అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురి అరెస్టు..

రూ.58వేలు స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని ప్లాటినం సిటీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఆదిబట్ల పోలీసులు, మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా నగరంలోని బీఎన్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్, హస్తినాపురానికి చెందిన వారు. వీరి వద్ద రూ.58,710 నగదు, ప్లేయింగ్ కార్డ్స్, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్

బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రదానం

చేవెళ్ల: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వివిధ రంగాల్లో రాణించే వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తోంది. ఇందులో భాగంగానే చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్‌కు కర్షకరత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు సంస్థ వ్యవస్థాపకుడు నల్ల రాధాకృష్ణ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఒక రైతుగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతులకు నిరంతరం సేవలు అందిస్తానని చెప్పారు. అదేవిధంగా మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌ను కూడా ఈ అకాడమీ ద్వారా ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపిక చేసి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డును అందించటం సంతోషంగా ఉందని చెప్పారు. అవార్డుకు ఎంపిక చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి

• పనులను పరిశీలించిన జలమండలి ఎండీ • నీటి సరఫరా పునరుద్ధరణ..

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని రెడ్ హిల్స్ వద్ద ధ్వంసమైన 825 ఎంఎం డయా పీఎస్‌సీ గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతు పనులను జలమండలి యుద్ధ ప్రాతిపతికన ఆదివారం సాయంత్రం పూర్తి చేసింది. అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో.. రెడ్ హిల్స్ రిజర్వాయర్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా ప్రారంభించారు. అంతకు ముందు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తొలగించిన పైపులను అక్కడినుంచి తరలించాలని సూచించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు, పైపులైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన పైప్‌లైన్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా, మురుగునీటి నెట్‌వర్క్ కోసం పైప్‌లైన్‌ల వివరాలను జీఐఎస్‌లో నమోదు చేయాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో వేగంగా స్పందించి.. సకాలంలో మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎండీ వెంట టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, డీజీఎం సరిత తదితరులు ఉన్నారు.

పుచ్చ సాగుకు సమయమిదే

ఆరుతడి పంటగా అనుకూలం

• తక్కువ నీటి వినియోగం
• మేలైన రకాలతో అధిక దిగుబడి

నవాబుపేట: రబీలో ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసి లాభాలు పొందవచ్చంటున్నారు ఉద్యానవన అధికారులు. ఈ పంట సాగుకు ఇదే అనువైన సమయమని డిసెంబర్‌లో విత్తనాలు విత్తితే మార్చి వరకు పంట చేతికి వస్తుంది. పంటకు ఇసుక నేలలు అనుకూలమని, మేలైన రకాలను ఎంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. పుచ్చకాయ సాగుకు ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. 60 నుంచి 80 క్వింటాళ్ల వరకు దిగుబడి ఆశించవచ్చు. దీంతో రైతులు పుచ్చ సాగుకు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది వికారాబాద్ డివిజన్ పరిధిలో 250 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి మరింత పెరిగే ఆస్కారం ఉంది.

విత్తుకునే విధానం

ఎకరానికి అర కిలో విత్తనాలు సరిపోతాయి. విత్తన శుద్ధి చేసి విత్తుకోవడం ఉత్తమం. అందుకోసం కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్ పట్టించాలి. ముందుగా నేలను బాగా దున్ని, చదును చేసుకోవాలి. సారవంతమైన నేలలో 3 మీటర్ల ఎడం పాటించి విత్తుకోవాలి. తేలికపాటి, సాధారణ నేలల్లో 25 మీటర్ల ఎడం, 60 సెంటీమీటర్ల వెడల్పు గల నీటి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తనాలు నాటిన తర్వాత మొలిచెందుకు ఒక తడి నీరందించాలి. ఆ తర్వాత నేల స్వభావం, వాతావరణాన్ని బట్టి 5 నుంచి 7 రోజులకోసారి నీరు పెట్టాలి. పూత సమయంలో నీరందిస్తే ఉత్తమం. కాయలు ఎదిగే దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. కలుపు నివారణ కోసం లీటరు నీటికి 6 మి.లీ పెండిమిథాలన్ లేదా ఆలాక్లోర్ కలిపి, కాల్వ బోదెలకు విత్తనం విత్తిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి.



నర్సరీలో సాగవుతున్న పుచ్చ నారు

మేలైన పుచ్చ రకాలు

అసాహియమాటా: ఈ రకం కాయలు 6 నుంచి 8 కిలోల బరువుతో పైన లేతాకు పచ్చరంగు, లోపల చిక్కటి గులాబీ రంగు కండ కలిగి ఉంటాయి. 11 నుంచి 13 శాతం చక్కరతో 95 రోజుల్లో పండు పక్వానికి వస్తాయి. ఎకరానికి 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

షుగర్ బేబీ: ఇవి త్వరగా విత్తుకోవడానికి అనువైనవి. కాయలు చిన్నవిగా, 2 నుంచి 3 కిలోల బరువుతో గుండ్రంగా ఉంటాయి. పైన నీలి వర్ణపు నలుపు, లోన చిక్కటి గులాబీ రంగు కండ ఉంటుంది. 11 నుంచి 13 శాతం చక్కరతో 80 నుంచి 85 రోజుల్లో పక్వానికి వస్తాయి. ఎకరానికి 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

అర్కజ్యోతి, అర్కమానిక్: పండ్లు గుండ్రంగా ఉండి పైనా ఆకుపచ్చ, ముదరాకుపచ్చ చారలతో ఉంటాయి. లోపల ఎరుపు కండ ఉంటుంది. 6 నుంచి 8 కిలోల బరువుతో ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇవికాక ఎక్స్ ఎస్–3955, అపూర్వ స్వీట్‌డ్రాఎక్స్, మాధురి, మధుబిందు, ఏటీటీ–3088 తదితర హైబ్రిడ్ రకాలు ఉన్నాయి.

ఎరువుల వినియోగం

ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. అదే విధంగా 250 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్, 90 కిలోల యూరియాను వాడాలి. నత్రజని ఎరువును నాటేటప్పుడు రెండుపర్యాయాలు, 25 రోజుల తర్వాత మరోసారి వేయాలి. పూత, పిందె సమయంలో 80 కిలోల కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ను కలిపి మొదళ్లకు ఇరువైపులా వేసి మట్టి కప్పాలి. తీగపారే సమయంలో తల తుంచి, సూక్ష్మ ధాతువులు మొక్కలను అందేలా లీటరు నీటికి ఫార్ములా–4 లేదా ఆగ్రోమిక్స్ మాక్స్- గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ

మొజాయిక్ వెర్రి తెగులు సోకినప్పుడు ఆకులు ఆకారం కోల్పోయి ఆకుపచ్చ, పసుపురంగు మచ్చలు వ్యాపించి బొబ్బలు ఏర్పడతాయి. తీగలు కురుచగా మారి, తక్కువ కాపు, కుక్కమూతి పిందెలు వస్తాయి. వీటి నివారణకు పంట తొలిదశలోనే వైరస్ సోకిన మొక్కలను ఏరి నాశనం చేయాలి. తెగులు వ్యాప్తికి దోహదపడే పేనుబంక పురుగు నివారణకు లీటరు నీటికి 15 గ్రాముల ఎసిఫేట్ కలిపి, ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

లాభదాయకం



రైతులు ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసుకొని లాభాలు పొందవచ్చు. ఈ పంట సాగుకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంత వాతావరణానికి అనువైన రకాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలి. పూత, కాయదశల్లో తగుజాగ్రత్తలు పాటించి కాయ ఊరేలా చూసుకోవాలి.

– అక్షితరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, వికారాబాద్ డివిజన్

తెలుగుజాతి గర్వించే వ్యక్తులు బాపూ-రమణ

బంజారాహిల్స్: తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తులు బాపూ–రమణలు అని మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో బాపు–రమణ అకాడమీ ఆధ్వర్యంలో బాపు రమణ–2024 పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ. రమణాచారి మాట్లాడుతూ ఒకరు చిత్రకారుడిగా, ఒకరు రచయితగా ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వంలా వారిద్దరూ నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా బాపూ–రమణ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు అందజేశారు. కార్టూనిస్ట్ సురేంద్రకు బాపు పురస్కారం, రచయిత భువనచంద్రకు రమణ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం కార్టూనిస్ట్ గాంధీ రూపొందించిన 'మనోహరాలు–గాంధీ కార్టూన్లు' సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటుడు ఉత్తేజ్ పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న రమణాచారి

21న కృతజ్ఞతా సభను విజయవంతం చేయండి

పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నిరుద్యోగులకు 54 వేల ఉద్యోగాలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ నెల 21న ఓయూలో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో నిర్వహించిన 2కే వాక్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని, ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విద్యారంగ సమస్యలపై దృష్టి సారించిందన్నారు. గురుకుల విద్యార్థులు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు, రైతులకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రజా పాలనకు కృతజ్ఞతగా నిర్వహిస్తున్న సభకు విద్యార్థులు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు మెడ శ్రీను, క్రాంతికుమార్, సతీష్, వినయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మాడ్గుల: మండలంలోని ఆమనగల్లు–మాల్ వెళ్లే రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మండలానికి చెందిన పల్లె జంగయ్య దేవరకొండ నుంచి స్కూటీపై ఆమనగల్లుకు వస్తుండగా మార్గమాధ్యలో ఇర్విన్ గ్రామం వద్ద స్కూటీ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో జంగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం కమిటీ ఎన్నిక



సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పీఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గిరిధర్‌గౌడ్, కోశాధికారిగా తుకారాం గెలుపొందారు. పట్టణానికి చెందిన గిరిధర్‌గౌడ్ గతంలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శిగా పనిచేశారు. నూతన కమిటీ సభ్యులను ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.


వృద్ధుడు అదృశ్యం



వెంకటయ్య (ఫైల్)

చేవెళ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కటికం వెంకటయ్య(70)కు మతిస్థిమితం సరిగా లేదు. ఇంటివద్దనే ఉండే అతడు రోజు గ్రామంలో తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు గ్రామస్తులను, తెలిసిన వారిని అడిగిన అతని జాడ తెలియలేదు. దీంతో ఆదివారం ఉదయం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కొడుకు శివకుమార్ తన తండ్రి కనిపించటం లేదని ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు వృద్ధుడు అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఎలాంటి సమాచారం తెలిసిన చేవెళ్ల పోలీస్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

రక్తం కక్కుకొని వ్యక్తి మృతి



బరిహా మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖం కడుక్కుంటుండగా నోట్లో నుంచి రక్తం కక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలిస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజ్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాఘాముండా, దెబ్బున్ బాలాంగిరి జిల్లాకు చెందిన బానామాల్ బరిహా(23) ఆరు రోజుల క్రితం ఎంపీపటేల్‌గూడ సమీపంలోని గోరంట లక్ష్మయ్య ఇటుక బట్టీలో కూలి పనికి చేరాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు నిద్రలేచి ముఖం కడుక్కుంటుండగా ముక్కు, నోట్లో నుంచి రక్తం కారి అపస్మారకస్థితికి వెళ్లాడు. గమనించిన బట్టీ నిర్వాహకుడు 108లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యలో బరిహా మృతి చెందాడు. కేసు విచారణలో ఉంది.

కారు సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం



నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్‌లో చెలరేగుతున్న మంటలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హైదర్‌గూడలోని నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒక కారు పూర్తిగా దగ్ధం కాగా మరో నాలుగు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అఫ్రోజ్, రవి అనే వ్యక్తులు గత కొంత కాలంగా హైదర్‌గూడలో నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి సిబ్బంది సర్వీసింగ్ సెంటర్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఎవరూ రాలేదు. ఆదివారం మధ్యాహ్నం సర్వీసింగ్ సెంటర్ నుంచి పొగలు వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమై పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అత్తాపూర్ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఒక కారు పూర్తిగా కాలిపోయిగా, మరో నాలుగు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

తండ్రి మందలించాడని..

• యాసిడ్ తాగి యువకుడి బలవన్మరణం

జవహర్‌నగర్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాప్రా జమ్మిగడ్డ, బీజేఆర్‌నగర్‌కు చెందిన వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ నెల 14న కుమారులు ముగ్గురూ గొడవ పడుతుండటంతో వెంకటేష్ వారిని వారించాడు. పెద్ద కుమారుడు సాయికృష్ణ (18)ను ఏదైనా పని చేసుకోవాలని చెప్పి మందలించాడు. దీంతో మనస్తానికి లోనైన సాయికృష్ణ అదే రోజు రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలిచారని..

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బౌద్ధనగర్: పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలవడంతో ఆందోళనకు గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వారాసిగూడ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్ రామాలయం ప్రాంతానికి చెందిన మచ్చ శ్రీకాంత్ (32) ముషీరాబాద్ జీహెచ్‌హెంసీ సర్కిల్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతడి భార్య శృతి క్యాటరింగ్‌లో పని చేస్తుంది. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన శ్రీకాంత్ తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ నెల 13న ఆమె మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 16న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పోలీసులు శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. దీంతో భయాందోళనకు గురైన శ్రీకాంత్ ఆదివారం చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి తండ్రి స్థానికుల సహాయంతో కిందకు దించి 108కు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

నిందితుడి అరెస్ట్

నాగోలు: ప్రేమ పేరుతో ఓ బాలికను వెంటపడి వేధిస్తున్న యువకుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, పోలేపల్లికి చెందిన యలమల్ల సతీష్ మన్సూరాబాద్‌లో నివాసం ఉంటున్న తన అక్క, బావ ఇంట్లో ఉంటున్నాడు. అతను అదే కాలనీకి చెందిన బాలిక(13)ను ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి వేధించడమేగాక, రాత్రి వేళల్లో వారి ఇంటికి వెళ్లి గట్టిగా అరుస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న సతీష్ దుబాయ్‌లో ఉంటున్న బంధువుల వద్దకు పారిపోయాడు. ఇటీవల అతను నగరానికి తిరిగి వచ్చినట్లు తెలియడంతో ఎల్‌బీనగర్ పోలీసులు ఆదివారం అతడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

కండక్టర్ శ్యామలకు ప్రశంసల వెల్లువ

పరిగి: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ వృద్ధురాలు తన పర్సు పోగొట్టుకోవడంతో కండక్టర్ శ్యామల తిరిగి అందజేశారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన అమినబీ పరిగి నుంచి షాద్‌నగర్ వెళ్లే బస్సులో ప్రయాణం చేసింది. ఈ క్రమంలో ఆమె కూర్చున్న సీట్లో పర్సు పెట్టి తను దిగాల్సిన స్టేజీ రాగానే బస్సు దిగేసింది. పడిపోయిన పర్సును వేరే ప్రయాణికుడు తీసుకుని వెళ్తుండగా గమనించిన కండక్టర్ ఈ సీట్లో ఓ వృద్ధురాలు కూర్చుంది ఆమెదే ఈ పర్సు అని పర్సు తీసుకుని పరిశీలించగా అందులో రూ.10వేల నగదు, ఆధార్ కార్డు లభ్యమైంది. ఆధార్ కార్డు వివరాల ఆధారంగా బస్సు తిరుగు ప్రయాణంలో గ్రామం స్టేజీ వద్ద బస్సు ఆపి వృద్ధురాలికి పర్సు అప్పగించింది. దీంతో డ్రైవర్ రాజు, కండక్టర్ శ్యామలను పలువురు అభినందించారు.



పోగొట్టుకున్న పర్సును వృద్ధురాలికి అందజేస్తున్న కండక్టర్, డ్రైవర్